క్లుప్తంగా

నేడు మండల సమావేశం

సంబేపల్లె : మండల సర్వసభ్య సమావేశం నేడు (శనివారం) ఉదయం 10.30 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీపీ ఆవుల నాగ శ్రీలక్ష్మీ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి హాజరవుతారన్నారు. ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చించనున్నట్లు చెప్పారు. సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని ఆమె కోరారు.

రోడ్డు ప్రమాదంలో విలేకరికి గాయాలు

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణం లక్ష్మీ ఫ్యారడైజ్ దగ్గరలోని ప్రధాన రహదారిలో ఓ పత్రికా విలేకరికి జరిగిన రోడ్డు ప్రమాదంలో శుక్రవారం గాయాలయ్యాయి. ద్విచక్రవాహనం నుజ్జునుజ్జు అయ్యింది. వివరాల్లోకి వెళ్తే కోడూరు పట్టణం నుంచి తన స్వగ్రామానికి ద్విచక్ర వాహనంలో వెళ్తున్న పాత్రికేయ విలేకరిని వెనుక నుంచి ఫార్చునర్ వాహనం ఢీ కొని వెళ్లింది. ప్రమాదంలో ద్విచక్రవాహనం ముందు భాగం పూర్తిగా దెబ్బతినగా విలేకరికి గాయాలయ్యాయి. దీంతో అతడిని హుటాహుటిన ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్యం నిర్వహించారు. దీనిపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పారిశుధ్యంపై దృష్టి పెట్టండి



మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ ధ్వజారెడ్డి

రైల్వేకోడూరు : మండల పరిధిలోని గ్రామ పంచాయతీలలో పారిశుధ్యంపై దృష్టి పెట్టాలని సిబ్బందికి వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి శుక్రవారం తెలిపారు. మండల సర్వసభ్య సమావేశంలో అధికారులతో కలిసి సర్పంచ్‌లు ఎంపీటీసీలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు లక్ష్యాల మేరకు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు గ్రామాలలో పారిశుధ్యం, తాగునీటి సౌకర్యం, హౌసింగ్‌లపై దృష్టిపెట్టి సమస్యలు పరిష్కరించాలని ఆయన తెలిపారు. ప్రతి ఒక్కరికీ అన్ని రకాలుగా సహకారం అందించి అన్ని పథకాలు పేద ప్రజల గడపకు చేరే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

పుల్లంపేట : మండల కేంద్రమైన పుల్లంపేట పంచాయతీలో గడప గడపకు మన ప్రభుత్వం మన ప్రభుత్వం కార్యక్రమం నేడు (శనివారం) ఉంటుందని ఎంపీడీఓ రఘురాం తెలిపారు. పుల్లంపేట పంచాయతీలోని కొండంపల్లి అరుంధతి వాడ, డేగావాండ్లపల్లి, బలిజపల్లి గ్రామాలలో ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు ప్రతి గడపకు వెళ్లనున్నట్లు పేర్కొన్నారు. మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఆలయం వద్ద అన్నదానం

వీరబల్లె (రాయచోటిటౌన్) : వీరబల్లె మండల కేంద్రంలోని ట్రాన్స్‌కో సబ్‌స్టేషన్ సమీపంలో ఉన్న శ్రీ దుర్గామాత ఆలయంలో శరన్నవరాత్రులు ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవాలలో భాగంగా శుక్రవారం ఉదయం రాజంపేట నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకుడు గాలివీటి విజయసాగర్ రెడ్డి ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజన సదుపాయాన్ని ఏర్పాటు చేశారు.

ఆరోగ్యానికి వరం ఆయుష్మాన్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ

రాయచోటి అర్బన్ : ఆయుష్మాన్ భారత్, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పేదల ఆరోగ్యానికి వరం లాంటిదని యండపల్లె పీహెచ్‌సీ ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ వై.విశ్వనాథరెడ్డి అన్నారు. శుక్రవారం రాయచోటి రూరల్ పరిధిలోని మాధవరం–2 సచివాలయంలో సచివాలయం కార్యదర్శి షాజియా సుల్తానా, ఏయన్ఎం శ్రీవిద్యలతో కలసి గ్రామ వలంటీర్లకు ఆ.భా. కార్డులను ప్రజలకు పంపిణీ నిమిత్తం అందజేశారు. ఆయుష్మాన్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ కార్డు ద్వారా సంవత్సరానికి ఉచితంగా రూ. 5లక్షల వరకు ఉచితంగా వైద్యం పొందవచ్చునన్నారు. మరింత సమాచారం కోసం వైద్య ఆరోగ్యశాఖ అధికారులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ ఎస్.షహనాజ్ పర్వీన్, డిజిటల్ అసిస్టెంట్ బి.బాలక్రిష్ణతోపాటు వలంటీర్లు పాల్గొన్నారు.

ఆలయ ప్రహరీకి విరాళం


ప్రహరీ పనులు చేస్తున్న దృశ్యం

ఓబులవారిపల్లె : మండలంలోని యాల్లాయపల్లె పంచాయతీలోని ఎస్టీ కాలనీ గంగమ్మ గుడి ప్రహరీ గోడ నిర్మాణానికి సర్పంచ్ జరుగు నారాయణరెడ్డి రూ. లక్ష విరాళం అందించారు. శుక్రవారం గంగమ్మ గుడి ప్రహరీ గోడ నిర్మాణ పనులను చేపట్టారు. ప్రహరీ నిర్మాణానికి ముందుకు వచ్చిన సర్పంచ్ నారాయణరెడ్డికి గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

సరస్వతీ.. నమస్తుభ్యం

సాక్షి, నెట్‌వర్క్ : శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పలు ఆలయాల్లో దేవతా మూర్తులు సరస్వతి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అందువల్ల అనేక మంది తల్లిదండ్రులు తమ పిల్లలతో తరలివచ్చి ప్రత్యేక అలంకరణలో ఉన్న అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవార్లకు ప్రీతికరమైన వారం శుక్రవారం కావడంతో అన్ని ఆలయాలకు భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. దీంతో ఆలయాలు భక్తులతో కిక్కిరిసాయి. కాగా పట్టణంలోని అమ్మవారిశాలలో వాసవీ కన్యకాపరమేశ్వరి దేవిని ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. పూజల్లో భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు తీర్థ, అన్న ప్రసాదాలను పంపిణీ చేశారు.


రాజంపేట టౌన్: వాసవీమాతను దర్శించుకుంటున్న పజాప్రతినిధులు


నల్లగంగమ్మ సన్నిధిలో మాజీ ఎమ్మెల్యే మోహన్ రెడ్డి దంపతులు


రాయచోటి టౌన్: సరస్వతి దేవిగా భద్రకాళి


చిట్వేలి: బిందె సేవ కార్యక్రమ దృశ్యం


రాజంపేట టౌన్: బిందెసేవ గ్రామోత్సవ దృశ్యం



నందలూరులో బిందె సేవలో ఆర్యవైశ్య యువకులు


రైల్వేకోడూరు పట్టణంలో బిందె సేవ కార్యక్రమం


రాజంపేట టౌన్: సరస్వతిదేవి అలంకారంలో వాసవీమాత


రైల్వేకోడూరు: ప్రత్యేక అలంకారంలో గంగమ్మ


నందలూరు: సరస్వతిదేవిగా కన్యకా పరమేశ్వరి


సిద్దవటం: సరస్వతి దేవి అలంకరణలో దుర్గా మాత


రాయచోటి టౌన్: గజలక్ష్మి రూపంలో వాసవీమాత


చిన్నమండెం: జగన్మోహినిగా కన్యకా పరమేశ్వరి


రాజంపేట టౌన్: విజయలక్ష్మీదేవి అలంకారంలో చౌడేశ్వరిదేవి


రాయచోటి టౌన్: సరస్వతి దేవిగా చౌడేశ్వరి అమ్మవారు


ఓబులవారిపల్లె: అన్నపూర్ణాదేవిగా కన్యకాపరమేశ్వరి


రామాపురం: మండల కేంద్రంలోని అమ్మవారిశాలలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

175 స్థానాల్లో గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం

- ప్రభుత్వం చేస్తున్న మంచిని ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు, పార్టీ రీజనల్ కో–ఆర్డినేటర్, ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి, అజయ్‌రెడ్డిలు


మాట్లాడుతున్న ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు

పెనగలూరు : రాష్ట్రంలో 175 సీట్లు సాధించడమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు పని చేయాలని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు, రీజనల్ కో–ఆర్డినేటర్, ఎమ్మెల్సీ పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి, రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ కొండూరు అజయ్‌రెడ్డిలు తెలియజేశారు. శుక్రవారం సాయంత్రం పెనగలూరులో గృహసారథులు, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులతో భారీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు మాట్లాడుతూ వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సుదీర్ఘ పాదయాత్రలో ప్రజల సమస్యలు తెలుసుకొని వాటి ఆధారంగా మేనిఫెస్టోను రూపొందించి, పథకాల అమలుకు వలంటీర్ల వ్యవస్థను తీసుకొచ్చారన్నారు. తెల్లరాకముందే అవ్వాతాతలకు తలుపు తట్టి పింఛన్లు ఇస్తున్న వ్యవస్థ దేశంలో ఎక్కడా లేదన్నారు. 175 సీట్లు సాధించడమే మనముందున్న పెద్ద కర్తవ్యమన్నారు. ప్రతి ఒక్కరూ కృషి చేస్తే అసాధ్యం కాకపోవచ్చని తెలిపారు. ప్రభుత్వం చేసిన మంచిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కేడర్‌కు గుర్తు చేశారు. అంతకుముందు ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అమలు కాని హామీలు ఇచ్చి ప్రజలను మభ్యపెట్టారన్నారు. టీడీపీ, దాని అనుకూల వర్గం దొంగలముఠాగా ఏర్పడి రాష్ట్ర ప్రభుత్వంపై బురదజల్లుతోందన్నారు. దీనిని ప్రజలకు తెలయజేయాలన్నారు. పార్టీ కోసం కష్టపడితే రాష్ట్రంలోని అన్ని స్థానాల్లో విజయం సాధించడం కష్టతరం కాదని తెలియజేశారు. గతంలో చంద్రబాబు నాయుడు పాలనలో విద్యుత్ బకాయిలపై కేసులు పెట్టారన్నారు. ఆ తరువాత దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఉచిత విద్యుత్ ఇవ్వగా దానిని తూచా తప్పకుండా పాటిస్తున్నారన్నారు. అనంతరం అజయ్ రెడ్డి మాట్లాడుతూ మేనిఫెస్టోలోని హామీలను 99 శాతం అమలుపరిచిన ఘనత మన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. త్వరలో ఎన్నికలు ఉన్నందున వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పార్టీ కోసం కృషి చేయాలని తెలియజేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నియోజకవర్గ నాయకులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతోనే పేదల అభ్యున్నతి

గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి


వృద్ధులకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటి అర్బన్ : సంక్షేమ పథకాల అమలుతోనే పేదల అభ్యున్నతి సాధ్యపడుతుందని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మున్సిపల్ పరిధిలోని ఎస్ఎన్‌కాలనీ – 2 సచివాలయం పరిధిలో 3వరోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన మున్సిపల్ వైస్ చైర్మన్ పి.దశరథరామిరెడ్డి, కౌన్సిలర్లు పి.విజయ, మిట్టా గీతలతో కలసి ఆయన పాల్గొన్నారు. ఎస్టీ కాలనీ, తిరుపతినాయుడు కాలనీ, గొల్లపల్లె, మిట్టావాండ్లపల్లె, దేవరదిన్నె పల్లెల్లో శ్రీకాంత్‌రెడ్డి గడప గడపకు వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ, సమస్యలపై ఆరా తీస్తూ, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా ? అంటూ ప్రజలను విచారించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందడం లేదంటూ తన దృష్టికి తీసుకువచ్చిన వారి ఎదుటనే అధికారుల ద్వారా వారికి పరిష్కార మార్గాన్ని చూపిస్తున్నారు. వీధులలో నెలకొన్న సమస్యల పరిష్కారంపై ఆయన ప్రత్యేక దృష్టిని సారిస్తున్నారు. ఆయన మాట్లాడుతూ ప్రజల సంక్షేమమే ధ్యేయంగా జగనన్న పాలన సాగుతోందన్నారు. ఎన్నికలలోనూ, మానిఫెస్టోలోనూ ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో దేశానికే సీఎం వైఎస్ జగన్ ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు.

అక్కున చేర్చుకున్న ఎస్టీకాలనీ ప్రజలు

ఎస్టీ కాలనీలో పర్యటించిన శ్రీకాంత్‌రెడ్డికి మున్సిపల్ వైస్ చైర్మన్ దశరథరామిరెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటా అపూర్వ స్వాగతాలు లభించాయి. కాలనీలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల ప్రజలు శ్రీకాంత్‌రెడ్డిని అక్కున చేర్చుకుని ఆత్మీయంగా తమ ఇళ్లకు ఆహ్వానించారు. ఎవరి సిఫారసులు లేకుండానే తమకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని, పేదల సంక్షేమం కోసం జగనన్న చిత్తశుద్ధితో కృషి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం తిరుపతినాయుడు కాలనీలో పర్యటించిన శ్రీకాంత్ రెడ్డికి కాలనీవాసులు ఘన స్వాగతం పలికారు. కృష్ణ జిల్లాకు ఎన్టీఆర్ జిల్లాగా సీఎం జగన్ నామకరణం చేయడం అభినందనీయమంటూ కాలనీలోని కమ్మ కుటుంబాలు హర్షం వ్యక్తం చేశాయి. మార్కెట్ కమిటీ చైర్మన్ వండాడి వెంకటేశ్వర్లు, వైఎస్ఆర్‌సీపీ నేతలు హబీబుల్లాఖాన్, అశోక్‌రెడ్డి, ఫయాజ్ అహమ్మద్, మురికినాటి వెంకట్రామిరెడ్డి, సుగవాసి శ్యామ్, జావీద్, అమీర్, మున్సిపల్ ఆర్‌ఐ మల్లికార్జున, డీఈ సుధాకర్‌నాయక్, డీటీ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

చిన్నమండెం : మండల వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ సలీం మాతృమూర్తి అఫ్సాన్ ఖాతున్ బీ(80) మృతి పట్ల ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ దేవనాథరెడ్డిలు సంతాపం తెలిపారు. శుక్రవారం చిన్నమండెంలోని మాజీ సర్పంచ్ నివాసంలో కుటుంబసభ్యులను వారు పరామర్శించారు. వీరి వెంట వైస్ ఎంపీపీ ఏజాస్‌ఆలీఖాన్, సర్పంచ్ నజీర్ అహమ్మద్, ఎంపీటీసీ రమేష్, షారుల్లా, చుక్కా అంజనప్ప, జహీర్‌ఖాన్, యాహియాఖాన్, సజాద్, సిబకతుల్లాఖాన్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన సేవలందించండి

రాయచోటి టౌన్ : వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించినప్పుడే గుర్తింపు లభిస్తుందని రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి అన్నారు. శుక్రవారం రాయచోటి పట్టణంలోని కొత్తపేటలో వేంపల్లె దివాకర్‌రెడ్డి నూతనంగా లెట్ రిలాక్స్ (స్త్రీ, పురుషులు) స్పా సెలూన్ ఆయన ప్రారంభించారు.

హెల్మెట్‌ను విధిగా ధరించాలి

చిన్నమండెం : ద్విచక్ర వాహనదారులు ప్రతి ఒక్కరూ హెల్మెట్‌ను విధిగా ధరించాలని చిన్నమండెం ఎస్ఐ రమేష్‌బాబు సూచించారు. శుక్రవారం మదనపల్లె – రాయచోటి ప్రధాన రహదారిలోని కస్తూర్బా స్కూల్ వద్ద పలువురు ద్విచక్ర వాహనదారులకు ఆయన అవగాహన కల్పించారు. ఎస్ఐ మాట్లాడుతూ వాహనదారులు హెల్మెట్ వాడటం వలన ఏదైనా అనుకోని ప్రమాదం జరిగితే హెల్మెట్ రక్షణగా ఉంటుందన్నారు. అతివేగం ప్రమాదకరమని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదన్నారు.

జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందాం


మాట్లాడుతున్న పార్టీ కన్వీనర్ యధుభూషణ్‌రెడ్డి

గాలివీడు : జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకుందామని మండల వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎస్‌కే కల్యాణ మండపంలో రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీపీ జల్లా పద్మావతమ్మ మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి చెందాలంటే మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. పార్టీ కన్వీనర్ యదుభూషణరెడ్డి మాట్లాడుతూ ఆదర్శంగా నిలిచేలా పరిపాలన చేస్తున్న జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుందామన్నారు. రాబోయే ఎన్నికల్లో అందరూ కలిసికట్టుగా పనిచేసి పార్టీని అధికారంలోకి తీసుకురావాలని తెలియజేశారు.

రాష్ట్రంలో ప్రజారంజక పాలన

ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే మేడా, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి, మున్సిపల్ చైర్మన్ పోలా


చెత్తబండ్లను ప్రారంభిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్, మున్సిపల్ చైర్మన్‌లు

రాజంపేట టౌన్ : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ప్రజారంజక పాలన కొనసాగిస్తున్నారని ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి తెలిపారు. మున్సిపాలిటీకి ప్రభుత్వం మంజూరు చేసిన చెత్తబండ్లను, సుద్దగుంతల్లో నిర్మించిన సిమెంటు రోడ్డును, బలిజపల్లెలో నూతనంగా నిర్మించిన అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను శుక్రవారం ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డిలతో కలిసి ఎంపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ అనేక దశాబ్దాలుగా పట్టణంలో లోతట్టు ప్రాంతమైన సుద్దగుంతలవీధి చిన్నపాటి వర్షం కురిసినా జలమయమయ్యి అక్కడి ప్రజలు వర్షాకాలంలో ఇతర ప్రాంతాలకు వెళ్ళి తలదాచుకునేవారన్నారు. అయితే గత మున్సిపల్ ఎన్నికల సందర్భంగా కౌన్సిలర్ మనుబోలు విజయలక్ష్మి సిమెంటు రోడ్డు నిర్మించి సమస్యను పరిష్కరిస్తామని ప్రజలకు హామీ ఇచ్చారని, ఆ హామీ మేరకు తాము సమస్యను పరిష్కరించామన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీ కూడా నెరవేర్చుతామనేందుకు సుద్దగుంతల్లో దశాబ్దాలుగా ఉన్న సమస్య పరిష్కరించడమే ఓ తార్కానమని ఎంపీ తెలిపారు. ఎమ్మెల్యే మేడా, జెడ్పీ చైర్మన్ ఆకేపాటిలు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒకవైపు రాష్ట్రంలో వెల్లువలా సంక్షేమ పథకాలను అమలు చేస్తూనే మరోవైపు అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నారని తెలిపారు. అయితే ప్రతిపక్షాలు ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తుండటం సిగ్గుచేటన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలంతా జగన్‌కు బాసటగా నిలిచి మళ్లీ ఆయననే సీఎం చేసుకుంటేనే పేదరికం లేని సమాజం సాధ్యం కాగలదని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ జి.రామకృష్ణారెడ్డి, మున్సిపల్ కమిషనర్ జనార్ధన్‌రెడ్డి, తహసీల్దార్ సుబ్రమణ్యంరెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్ఓ చిన్నికృష్ణ, డాక్టర్ మస్తాని, మున్సిపల్ వైస్ చైర్మన్ మర్రి రవి, కౌన్సిలర్లు మనుబోలు విజయలక్ష్మి, సనిసెట్టి నవీన్‌కుమార్, న్యామతుల్లా, విష్ణు, తంబా సుబ్రమణ్యం, రాఘవేంద్రవర్మ, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ జెనగు కృష్ణారావుయాదవ్, వడ్డే రమణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల నిరసన దీక్ష

రాయచోటి అర్బన్ : ఓపీఎస్‌ను వెంటనే అమలు చేయాలన్న డిమాండ్‌తో ఉద్యోగులు గురువారం ప్రారంభించిన నిరవధిక నిరసన దీక్షలు రెండవ రోజు కొనసాగాయి. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు, సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి జాబీర్‌లు మాట్లాడుతూ ఉద్యోగుల న్యాయపరమైన కోర్కెలను తీర్చడంలో ప్రభుత్వం మొండి వైఖరిని అవలంభించడం తగదన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులంతా ఓట్ ఫర్ ఓపీఎస్ అనే ఆలోచనలో ఉన్నారన్నారు. అనంతరం డీఈఓ శ్రీరామ్ పురుషోత్తం నిరసనకారులతో చర్చలు జరిపి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరింపజేస్తానంటూ హామీ ఇచ్చి దీక్షలను విరమింపచేశారు. కార్యక్రమంలో సంఘం నేతలు చంద్రశేఖర్, సి.వి.రమణమూర్తి, పి.వెంకటరమణ, దావుద్దీన్, సురేంద్రారెడ్డి, గంగాదేవి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామాంజులు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు శ్రీరామరక్షగా జగనన్న ఆరోగ్య సురక్ష


లక్కిరెడ్డిపల్లె: రోగుల సమస్యలు తెలుసుకుంటున్న ఎంపీపీ సుదర్శన్ రెడ్డి

లక్కిరెడ్డిపల్లె : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం గ్రామీణ ప్రాంతాలలోని పేద ప్రజలకు శ్రీరామరక్షగా నిలుస్తోందని అన్నమయ్య జిల్లా ఎంపీపీల సంఘం అధ్యక్షుడు మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని మద్దిరేవుల గ్రామం ఈడిగపల్లె కస్పాలో సర్పంచ్ చంద్రమ్మ, ఉపసర్పంచ్ సంజీవరెడ్డిల అధ్యక్షతన నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అక్కడ రోగులకు అందుతున్న వైద్య సేవలను ఆరాతీశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వైద్యాధికారులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నందలూరు (రాజంపేట) : పేద ప్రజలకు వైద్య సేవలు అందించేందుకే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సౌభాగ్యమ్మ తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని పొత్తపి గ్రామ పంచాయతీ కుంపిణీపురం ప్రాథమిక పాఠశాలలో సర్పంచ్ విజయ్ కుమార్ అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యాధికారులు డాక్టర్ సృజన, డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎం.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సర్వేను పూర్తి చేయండి

సిద్దవటం : రెండవ విడత జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను వలంటీర్లు పూర్తి చేయాలని పెద్దపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రసాద్‌రెడ్డి అన్నారు. పెద్దపల్లి గ్రామ పంచాయతీలో శుక్రవారం వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 28న పెద్దపల్లి పంచాయతీలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరుగుతుందన్నారు. లబ్ధిదారులతో ఆయుష్మాన్ భారత్, ఈకేవైసీ చేయించాలని ఆయన తెలిపారు.